# క్రీడాభిరామం

మైకేల్ తన ఉద్యోగానికి రాజీనామా చేసి కాలిఫోర్నియా వెళ్ళిపోతున్నాడు. అందుకని ఆరోజు అందరం అతన్ని సెర్రానోస్ అనే మెక్సికన్ రెస్టారెంట్‌కి తీసుకు వెళ్ళాం. నేనూ, మైకేల్, డాన్, లీసా టేబుల్ చుట్టూతా కూర్చున్నాం. మా ఎదురుగా పెద్ద టీవీ వుంది. సిడ్నీ ఒలెంపిక్స్ గేమ్స్ ఓపెనింగ్ సెరెమొనీస్ వస్తున్నాయి. ఒక్కొక్క దేశంనించీ వచ్చిన ఆటగాళ్ళని చూపిస్తున్నారు.

"ఇప్పుడు సోవియట్ యూనియన్ లేదు కాబట్టి, ఈసారి రష్యాకి మొదటి స్థానంలో వుండేన్ని మెడల్స్ రావు" అన్నాడు డాన్.

డాన్ ఏ విషయాలమీద స్టాటిస్టిక్స్ చెప్పమన్నా టకటకా చెప్పేయగలడు. అన్నీ తెలుసుకోవటం కన్నా అతనిలో గొప్పతనం ఏమిటంటే, అన్నీ గుర్తుపెట్టుకుని అర్ధరాత్రి అప్పజెప్పమన్నా చెప్పేయగలడు.

"అయితే మెడల్స్ అమెరికాకే ఎక్కువ వస్తాయంటావా?" అన్నాను.

"వస్తాయా అంటావేమిటి. వస్తూనే వున్నాయి. 1988లో సోవియట్ యూనియన్‌కి 132 మెడల్స్ మనకి 94. తర్వాత సోవియట్ యూనియన్ ముక్కలయినా, 1992లో యూనిఫైడ్ టీమ్ అనే పేరుతో ఆడి 112 మెడల్స్ సంపాదించారు. అప్పుడు అమెరికాకి రెండో స్థానంలో 108 మెడల్స్ వచ్చాయి. 96లో అమెరికాకి 101, రష్యాకి 63. కనుక మనికీసారి అంటే 2000లో కూడా ప్రథమ స్థానం వస్తుంది" అన్నాడు డాన్ నెంబర్లన్నీ అప్పజెప్పుతూ.

వైటెస్‌కి ఆర్డర్ చెప్పి ఓపెనింగ్ సెరిమొనీ చూస్తున్నాను. ఒక్కొక్కదేశం వారూ వస్తున్నారు.

"ఏయ్.... మీ ఇండియా వాళ్ళు వస్తున్నారు చూడు... " అంది లీసా.

మనవాళ్ళు రంగురంగుల తలపాగాలు చుట్టుకుని వస్తున్నారు. ముందుగా మూడు రంగుల జాతీయ జెండా గాలిలో వయ్యారంగా ఎగురుతున్నది.

"చాలమంది వున్నారే...... ఇండియా కూడా చాల పెద్ద దేశం కదా..... మెడల్స్ బాగానే వస్తాయనుకుంటాను... " అన్నాడు మైకేల్.

నేను మాట్లాడలేదు. కొన్ని దశాబ్దాల క్రితం, నేను ఇండియాలో వున్నప్పుడు, హాకీలో తప్ప మనకి ఇంతవరకూ మెడల్స్ రావటమన్నది లేదు. 1996 అట్లాంటా ఒలెంపిక్స్‌లో లియాండర్‌కి టెన్నిస్‌లో వచ్చిన బ్రాంజ్ మెడల్, మన ఒలెంపిక్స్ ఎడారిలో ఒయాసిస్సులాంటిది.

డాన్ నోరు విప్పుతుంటే నాకు భయం వేసింది.

"ప్రపంచంలో దేశాలన్నిట్లోనూ చైనాలో జనాభా ఎక్కువ. 1.2 బిలియన్ల మంది వున్నారు. చైనాకి మెడల్స్ 1996లో 50, 1992లో 108, 1988 లో 49.....

ఇలా ఎప్పుడూ మొదటి ఆరు స్థానాల్లో ఎక్కడోచోట వుంటూనేవుంది. ఇండియా జనాభాలో రెండో స్థానంలో వుంది. ఒక మిలియన్ జనాభా. మిగతా చాల దేశాల కన్నా కూడా ఎక్కువమంది ఆటగాళ్ళను ఒలెంపిక్స్‌కి పంపుతుంది. అయినా గత ఇరవై ఏళ్ళలోనూ ఒకే ఒక మెడల్ వచ్చింది... " చెప్పుకుపోతున్నాడు డాన్.

నాకతను ఆ టాపిక్ మారిస్తే బాగుండుననిపింఏంది. ఈలోగా మిగతా చిన్న చిన్న దేశాలనించీ నలుగురైదుగురికన్నా ఎక్కువ మంది ఆటగాళ్ళు రావటం లేదు. అయినా వాళ్ళకి ఇండియా కన్నా ఎక్కువగానే మెడల్స్ వస్తున్నాయి. ఎందుకనీ? ఆ రోజునించీ ఒలెంపిక్స్ పూర్తయేదాకా ఆలోచిస్తూనే వున్నాను. లాస్ ఏంజెలెస్ ఒలెంపిక్స్ జరిగినప్పుడు పెరేడ్‌లో నడిచిన భారతీయుల్లో చాలమంది పెద్ద పొట్టలలో నడుస్తుంటే అదిరిపోయి, వీళ్ళేం ఆడతారా అనుకున్నాం తెలుగు మిత్రులం. అప్పుడే తెలిసింది ప్లేయర్లు ఎంతమందో అంతేమంది కోచ్‌లు ట్రెయినర్లూ వచ్చారని. వాళ్ళల్లో నిజంగా ఎంతమంది అసలైన వాళ్ళు, ఎంతమంది గవర్నమెంటుకి అల్లుళ్ళన్నది వాళ్ళని చూస్తే తెలుస్తుంది. అందులోనూ కొంతమంది ఆటల టైముకి అందుబాటులో లేకుండా షాపింగ్‌కి వెళ్ళారనే వార్తలూ వచ్చాయి. నిజానిజాలు వాళ్ళకే తెలియాలి. ఒలెంపిక్స్‌లో మనం ఫుట్‌బాల్‌లాటి ఆటల్లో కనీసం ఆడటానికి క్వాలిఫై కూడా కావటం లేదంటే, మరి మన ఫుట్‌బాల్ అసోషియేషన్లు ఎందుకో, వాటిని ఎవరు ఎలా నడుపుతున్నారా (?) అనే అనుమానం వస్తుంది

కేమెరాన్, ఇస్టోనియా, మొజాంబిక్ లాటి దేశాలనించి చాల కొద్దిమందే వచ్చి మెడల్స్ తీసుకుపోతుంటే, మనమింకా ఎక్కడవున్నాం? ఎందుకు జరుగుతున్నదిలా?

ఒక్క క్రికెట్టులో మనకి అప్పుడప్పుడూ కాస్త పేరు వస్తుంటుంది. ఒక్కొక్కప్పుడు గెలుస్తాంకూడాను. అప్పుడు మనందరికీ గర్వంగావుంటుంది. కొండొకచో అజరుద్దీన్, జడేజాలాటి బాట్స్‌మెన్ల ద్వారా బెట్టింగ్ చేసే విధానం బెట్టిదో తెలుసుకుంటాం. మన క్రికెట్ టీమ్‌ని చూస్తే, నాకో తెలుగు సినిమా పాటల రచయిత గుర్తుకి వస్తాడు. ఎంతో మంచి పాటలు వ్రాసి, చేయిజారి బూతు పాటలతో కాలం గడుపుతున్న రచయిత ఆయన. బూతు పాటలు రాయనప్పుడు, ఆయన పాటల్లో ఎన్నో చక్కటి మాటలు, ఒకదాని పక్కన ఒక్కటి ఎంతో అందంగా వుంటాయి. అన్నీ కలిపి అర్థం వెతికితే శూన్యం. ఏమీ వుండదు. అలాగే మన క్రికెట్ టీమ్‌లో పదకొండుమంది వరల్డ్ క్లాస్ ప్లేయర్లు వుంటారు ఒక్కొక్కళ్ళని విడివిడిగా చూస్తే దిట్టలే. అందరూ కలిస్తే గెలుపూ ఓటమీ గాలివాటానికి వదిలేసిన దైవాధీనం సర్వీస్

వింబుల్డన్‌లో అనుకుంటాను లియాండర్ పైస్, మహేష్ భూపతి టెన్నిస్ డబుల్స్‌లో గెలిచి అందర్నీ ఆశ్చర్యపరిచారు. ఇక్కడ మా అమెరికన్ మిత్రులతో కాలరెగరేసి మరీ గొప్పగా చెప్పుకున్నాం. ఇండియాకి తిరిగివెళ్ళగానే వాళ్ళిద్దరికీ మనస్పర్థలు. కలిసివుంటె లేదు సుఖం అని విడిపోయారు. కొన్నాళ్ళు వేరే వేరే

ఆడి, కలిసివుంటే కలిసొస్తుందేమోనని మళ్ళీ కలిశారు. అయినా కలిసిరాక గెలవ లేదు. ఏమిటో ఆ దురహంకార రాజకీయాలు. వాళ్ళకే తెలియాలి.

అమెరికాలో ఒలెంపిక్స్ బాస్కెట్ బాల్ టీమ్‌ని ఎంతో ముందరే సెలెక్ట్ చేసి ఎంతో ట్రెయినింగ్ ఇస్తారు. అది టీమ్ గేమ్ కనుక ఆటగాళ్ళ మధ్య ఎంతో అవగాహన, ఒకళ్ళనొకళ్ళు అర్థంచేసుకోవటం అవసరం ఒక ప్లేయర్ విసిరే బంతి ఎటు వేస్తాడో వాళ్ళకి ఆ సాధనవల్ల సులభంగా తెలుస్తుంది. ఇప్పుడు ఎలా వుందో తెలియదు కానీ, నేను ఇండియాలో వున్నప్పుడు మన హాకీ టీమ్ ప్లేయర్లని ఎలా సెలెక్ట్ చేశేవారో చూస్తే, వీళ్ళు పాపం ఎలా గెలుస్తారా అని బాధ వేసేది. ఎల్లుండి సాయంత్రం విమాన ప్రయాణం అనే దాకా ఎవరు పెడుతున్నారో తెలీదు. చివరి క్షణంలో టీమ్‌లో ప్లేయర్ల పేర్లు ప్రకటించేవారు. అప్పటికప్పుడు బయల్దేరి వెళ్ళే వాళ్ళు. ఫలానా పంజాబ్ సింగ్ అందించిన బంతిని అందుకోవటానికి తమిళ్‌నాడు భాస్కరన్‌గారికి, ఎటు వెళ్ళి అందుకోవాలో తెలీదు. అదీకాక భాషా బేధం ఒకటి. హఠాత్తుగా ఆ టీమ్ వర్క్ ఎక్కడినించి వస్తుంది?

రామాయణంలో పిడకల వేటలా మళ్ళీ డోప్ టెస్టుల భాగోతం. ఆ డోప్ టెస్టుల్లో డాక్టర్ల హస్తాలే కాక, జేబులూ వున్నాయని ఒక గాలి కబురు.

ఇండియాలో అత్లెటిక్ ఫెడరేషన్లు రెండు వున్నాయిష. (నాకా వివరాలు ఇంతకన్నా ఎక్కువ తెలీదు. క్షమించాలి) వాళ్ళ పదవీ రాజకీయాలు వాళ్ళవిట. 2000 సంవత్సరంలో సిడ్నీలో జరిగిన ఒలెంపిక్స్‌లో అక్కడికి వచ్చిన అందరూ దండగే అంటాడొక ఫెడరేషన్ అఫీషియల్. ఎందుకు ఓడిపోయామో, ఇండియా వెళ్ళాక చూద్దాం అన్నాడు బహదూర్ సింగ్ అనే చీఫ్ కోచ్, బహుదూరంగా వున్న ఆస్ట్రేలియాలోని సిడ్నీలో. అంత దూరంనించి ఇండియా వచ్చి ఆయనేం చేశాడో వచ్చే ఒలెంపిక్స్‌లో వెండితెరపై చూద్దాం.

నేను మన ప్లేయర్లని తప్పుపట్టటంలేదు. తమ రాజకీయాలలో ఆటగాళ్ళతో, వాళ్ళ జీవిత ఆశయాలతో ఆటలాడుకునే మహానుభావుల గురించి చెబుతున్నాను. ఏ ఆటలూ ఏనాడూ ఆడని వినాయకులు, అసలు సెలెక్షన్ కమిటీలలోకి ఎలా వెడుతున్నారో అందరికీ తెలుసు. గవర్నమెంట్ ఖర్చు పెడుతున్న డబ్బుల్లో ఎంత సవ్యంగా ఖర్చవుతున్నదీ ఎలా ఖర్చవుతున్నదీ ఆటలమీద ఉత్సాహం వున్నప్రజలు అడగవలసిన ప్రశ్న. రాజకీయ నాయకులూ, వాళ్ళ చెమ్చాలూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలూ ఏనాడయితే మన జాతీయ, అంతర్జాతీయ ఆటల్లోనించీ బయటికి పోతారో, ఆనాడే మనకి ఒలెంపిక్స్‌లో మెడల్స్ వచ్చేది.

అప్పటిదాకా మన మనసుల్లో మల్లెల మాలలని ఊగించిన మల్లీశ్వరిని చూసి గర్విద్దాం. మన వినాయకులు పోయినసారి సిడ్నీకి పోకుండా, ఈవిడని ఎలా ఆపుదామా అని అనుకున్నారుట. ఈసారి వాళ్ళకి ఆ అవకాశం రాకుండా మనకొక మెడలు సంపాదించి, వాళ్ళ మెడలు వంచింది ఈవిడ. ఈసారి ఆవిడ ఆకాశవీధిలో దేశదేశాలు తిరక్కుండా ఎలా అడ్డు వస్తారో చూద్దాం.

* * *